# రైతువేదికలపై అక్కసు!

గత కేసీఆర్ సర్కారు చేపట్టిన పథకాలపై కాంగ్రెస్ సర్కారు అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నది. దేశ ప్రజలకు అన్నం పెడుతున్న తెలంగాణ రైతులను పచ్చగా ఉంచాలనే ఉద్దేశంతో వారికి అనేక పథకాలను గత ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేశారు. అందులో భాగంగా కర్షకులకు ఉపయోగకరంగా ఉండేందుకు ప్రతి మండలంలోనూ క్లస్టర్ల వారీగా రైతువేదిక (ఆర్‌వీ)లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే కేసీఆర్ పొడగిట్టని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆయన తెచ్చిన ఈ రైతువేదికలపైనా తన భస్మాసుర 'హస్తాన్ని' ప్రయోగిస్తున్నది. ఇదే క్రమంలో భద్రాద్రి జిల్లాలోని సింహభాగం రైతువేదికలపై శీతకన్ను వేసింది. వాటి నిర్వహణకు కనీసం నిధులు కూడా మంజూరు చేయడం లేదు. కనీసం వాటిల్లో రైతులకు సమావేశాలు, అవగాహన సదస్సుల వంటివి కూడా నిర్వహించడం లేదు. రైతుబంధు, రైతుబీమా, పంటల నమోదు, ధాన్యం కొనుగోళ్లు, పంట నష్టపరిహారాలు, విత్తనాలు వంటి పనుల కోసం, వాటి దరఖాస్తులు అందజేయడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతులతో కళకళలాడిన ఈ రైతువేదికలు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వెలవెలబోతున్నాయి. కేవలం కేసీఆర్ మీద ఉన్న అక్కసు కారణంగానే ఇప్పుడు ఈ రైతువేదికలను ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వినియోగంలోకి తేవడం లేదు.

– భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 9 (నమస్తే తెలంగాణ)



లక్ష్మీదేవిపల్లి మండలం జూబ్లీపురంలో ఎప్పుడు తీశారో కూడా తెలియని విధంగా ఉన్న రైతువేదిక

- నిర్వహణ కోసం నిధులివ్వని కాంగ్రెస్ సర్కారు
- రైతులు, సమావేశాలతో నాడు కళకళ .. నేడు వెలవెల
- 'ఆర్‌వీ'లను వినియోగించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- 'భద్రాద్రి'లో సింహభాగం 'వేదిక'లపై శీతకన్ను
- కేసీఆర్ పథకాలపై కొనసాగుతున్న భస్మాసుర 'హస్తం'

కాంగ్రెస్ సర్కారు వచ్చాక రైతువేదికలను రైతులకు ఉపయోగం లేకుండా చేసింది. భద్రాద్రి జిల్లాలో 23 మండలాల్లో 67 క్లస్టర్లకు గాను 67 రైతువేదికలను గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. ప్రతి క్లస్టర్‌లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన సమాచారాన్ని చేరవేసేది. అక్కడే ఏఈవో కూడా గదిని కేటాయించింది. కానీ ఇప్పుడు వాటిని ఏకంగా నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకున్నట్లుగా కన్పిస్తోంది. కనీసం వాటిని శుభ్రపరచడానికి కూడా నిధులు ఇవ్వడం లేదు. నీళ్లు కూడా పట్టకపోవంతో ఆర్‌వీల ఆవరణల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని మండలాల్లో అసలు ఆర్‌వీల తాళాలు తీసినట్లుగా కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు.

గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ప్రతి మండలంలో రైతులు సమావేశాలు పెట్టుకునేందుకు వీలుగా ఒక్కో దానికి రూ.22 లక్షల చొప్పున నిధులు వెచ్చించి 67 రైతువేదికలను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో అయితే రైతువేదికల నిర్మాణాలకు కొందరు దాతలు భూమిని దానంగా ఇచ్చారు. మరికొందరు దాతలు వారి కుటుంబీలకు జ్ఞాపకార్థంగా రైతువేదికల భవనాలను నిర్మించారు. మొత్తానికి ఈ రైతువేదికలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. బీఆర్‌ఎస్ సర్కారు అధికారంలో ఉన్నన్ని రోజులూ నిత్యం ఏదో సమావేశంతో ఇవి కళకళలాడేవి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించడంతో వీటిల్లో సమావేశాలు తగ్గిపోయాయి. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించినప్పుడు మండల కేంద్రాల్లోని రైతువేదికలోకి వెళ్లడం తప్ప ఇతర క్లస్టర్లలోని రైతువేదికలను తెరిచిన దాఖలాలు కూడా కన్పించడం లేదు. కనీసం వాటిని ఊడ్పించకపోవడంతో భవనాలు దుమ్ముపట్టి కన్పిస్తున్నాయి.



తాళం వేసి ఉన్న ములకలపల్లి రైతువేదిక


లక్ష్మీదేవిపల్లి మండలంలో ధ్వంసమైన రైతువేదిక బాత్‌రూం తలుపు



లక్ష్మీదేవిపల్లి మండలం జూబ్లీపురం రైతువేదికలో దుమ్ము ధూళితో ఉన్న హాలు, బల్లాలు



టేకులపల్లి మండలం గంగారం గ్రామంలో చిట్టడవిని తలపిస్తున్న ఎండిన మొక్కల మధ్య తాళం వేసి ఉన్న రైతువేదిక

## వినియోగించని ప్రభుత్వం..

జిల్లాలో ఉన్న 67 రైతువేదికల్లో సగానికి పైగా రైతువేదికలను ప్రస్తుత ప్రభుత్వం వినియోగించడం లేదు. ఇల్లెందు మండలం కేసముద్రం రైతువేదిక గేటుకు ఎప్పుడూ తాళం వేసే ఉంటోంది. లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రైతువేదికకు అసలు అధికారులు వస్తారో రారో అనేది అనుమానంగానే ఉంది. లోపలి కుర్చీలన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బాత్‌రూం తలుపు పగిలిపోయిన గుర్తులు కనబడుతున్నాయి. ములకలపల్లి మండలంలో నాలుగు రైతువేదికలు ఉంటే ఒకదాన్ని మాత్రమే అధికారులు ఉపయోగిస్తున్నారు. అది కూడా ఏఈవోలు మొక్కుబడిగా వచ్చి కనబడి వెళ్తుతన్నట్లు తెలుస్తోంది. ఆళ్లపల్లి మండలం మర్కోడు రైతువేదిక ఖాళీగా దర్శనమిస్తున్నది. టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌లో గుట్టమీద కట్టిన రైతువేదిక పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

### కట్టినప్పుడు బాగానే ఉన్నాయి..



ఈ రైతువేదికలను గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. ఆ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ ఈ రైతు వేదికలు కూడా మంచిగానే ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్వీల ఆవరణల్లోని చెట్లన్నీ ఎండిపోయాయి. ఏదైనా మీటింగ్ ఉంటే లోతువాగు దగ్గరకు రమ్మని చెబుతున్నారు. రైతుల సమస్యలపై చర్చించేందుకు రైతువేదికల్లో సమావేశాలు పెట్టాలిగానీ ఎక్కడో ఎందుకు పెట్టాలి?

**– రాములు, రైతు, కారుకొండ, లక్ష్మీదేవిపల్లి**

### ఉపయోగం లేకుండా చేస్తున్నారు?



మా రైతుల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం కట్టిన రైతువేదికలను ప్రస్తుతం ఉపయోగం లేకుండా చేస్తున్నారు. వాటిల్లో నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఎప్పుడో ఒకసారి మాత్రమే వచ్చిపోతున్నారు. రైతులను పిలిచి సమావేశాలు పెట్టిన పాపానపోలేదు. వ్యవసాయ రుణాలు, ఎరువులు, పంటల పెట్టుబడి సాయాల గురించి ఏఈవోలను కలిసి అడుగుదామంటే కనీసం వాటి తాళాలు తీసి ఉండడం లేదు.

**– కాసిబోయిన సతీశ్, రైతు, సూరారం, దుమ్ముగూడెం**

### ఏఈవోలు వస్తారు..



ప్రతిరోజూ ఫీల్డ్ విజిట్ చేసి ఆ క్లస్టర్ పరిధి ఏఈవో అక్కడి రైతువేదికకు వచ్చి వెళ్తారు. నిర్వహణలేక కొన్ని నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. నిర్వహణ కోసం నిధులు ఏమీ లేవు. సిబ్బంది వచ్చి ఊడ్చుకుని మరీ అక్కడే ఉంటున్నారు. కొన్ని ఏరియాల్లో రైతువేదికలు గ్రామానికి దూరంగా ఉండడం వల్ల రైతులు రావడం లేదు. సమావేశాలు, వీడియోకాన్ఫరెన్సులు రైతువేదికల్లోనే జరుగుతున్నాయి.

**– వేల్పుల బాబూరావు, డీఏవో, భద్రాద్రి**

---

'సీతారామ'కు భూములిచ్చిన మాకే..

# ముందుగా నీళ్లివ్వాలి

- మాకు ఇవ్వకుండా ఇతర జిల్లాలకు తీసుకెళ్తే ఊరుకునేది లేదు
- అన్నపురెడ్డిపల్లిలో 'సీతారామ' భూ నిర్వాసిత రైతుల నిరసన
- కాలువ వద్ద కేసీఆర్ ఫ్లెక్సీకి పాలు, గోదావరి జలాలతో అభిషేకం


కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 9: సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం భూములిచ్చిన తమకే ముందుగా సాగునీళ్లు ఇవ్వాలని అన్నపురెడ్డిపల్లి మండల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్న కాలువల ద్వారా స్థానిక చెరువులను నింపాలని, వాటి ద్వారా తమ పంట పొలాలకు జలాలు అందించాలని కోరారు. ఈ మేరకు సీతారామ కాలువ నిర్మాణానికి భూములిచ్చిన రైతులందరూ కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల గుంపెన గ్రామ శివారులోని సీతారామ కాలువ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రాజెక్టు కాలువ కింద కోసం భూములు కోల్పోయిన తమకు ప్రస్తుత ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. లింక్ కెనాళ్లతో ఇతర జిల్లాలకు తరలిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కాలువ కోసం భూములిచ్చిన తమకు తొలి ప్రాధాన్యంగా నీళ్లు ఇవ్వకుండా వేరే జిల్లాలకు తరలిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు వేముల హరీశ్, మామిళ్లపల్లి రామారావు, వెంకటేశ్, ప్రవీణ్, గోపాలరావు, కిరణ్, సుధాకర్, చిరంజీవిరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ ఫ్లెక్సీకి అభిషేకాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టును నిర్మించిన గత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని అన్నపురెడ్డిపల్లి మండల రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు నిరసన దీక్ష శిబిరం వద్ద ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలతోనూ, గోదావరి జలాలతోనూ అభిషేకం చేశారు. 'జై కేసీఆర్', 'జైజై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు.


నిరసన తెలుపుతున్న రైతులు

---

కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే రైతన్నలు విలవిలలాడుతున్నారు. యాసంగిపై ఎన్నో ఆశలతో సాగు చేసిన రైతులు మొక్కజొన్నకు చివరిదశలో సాగునీరు అందక ఆవేదన చెందుతున్నారు. సాగునీరు సక్రమంగా అందించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. బీబీసీ (బోనకల్లు బ్రాంచి కెనాల్) కాలువ ద్వారా వారబందీ పద్ధతిలో నీరు విడుదల చేస్తుండడంతో చివరి భూములకు నీరు అందడం లేదు. బోనకల్లు మండలంలోని నారాయణపురం, ఆలపాడు, రావినూతల గ్రామాలు, చింతకాని మండలం నాగిలిగొండ, వల్లాపురం మేజర్‌లో గోవిందాపురం (ఎల్), తూటికుంట్ల గ్రామాల రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. కుంటలు, చెరువుల్లో నీటిని ఆయిలింజన్ల ద్వారా చాలాదూరం పైపులైన్ వేసి మరీ మొక్కజొన్న పంటలను కాపాడుకుంటున్నారు. – బోనకల్లు, మార్చి 9

# పైరు ఎండుతోంది!

## పంటలు వెలవెల.. రైతన్నలు విలవిల

- కర్షకుల కండ్ల ముందే ఎండిపోతున్న మొక్కజొన్న
- బీబీసీ కెనాల్ పరిధిలో లబోదిబోమంటున్న రైతులు
- వారబందీ పద్ధతిలో చివరి భూములకు అందని సాగునీరు
- యాసంగిలో సాగునీటి కోసం అన్నదాతల అష్టకష్టాలు



ఎండిపోతున్న మొక్కజొన్న పైరు

బోనకల్లు మండలంలో రైతులు ప్రధాన నీటి వనరైన నాగార్జునసాగర్ జలాలపై ఆధారపడి పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నారు. బీబీసీ (బోనకల్లు బ్రాంచ్ కెనాల్) కాలువ పరిధిలోని సుమారు 24వేల ఎకరాల్లో రైతులు ఈ యాసంగికి మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి రూ.15 వేలకు కౌలుకు తీసుకుని ఒక్కొక్క ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశలో ఉంది. ఈక్రమంలో పంటలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వం వారబందీ విధానాన్ని అమలు చేస్తుండడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న కంకి వేసి గింజ పట్టే దశలో సాగునీరు అందకపోవడంతో కంకి గింజల పట్టక బొండలుగా మిగిలిపోయే పరిస్థితి ఉంది. సాగునీరు సక్రమంగా అందితే ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం నీరు లేకపోవడంతో కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. చివరి ఆయకట్టు భూములకు ఇప్పుడు పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చినా ఆ పంటలను కాపాడలేని దుస్థితి నెలకొంది. బోనకల్లు మండలంలోని నారాయణపురం, ఆలపాడు, రావినూతల గ్రామాలు, చింతకాని మండలం నాగిలిగొండ, వల్లాపురం మేజర్‌లో గోవిందాపురం (ఎల్), తూటికుంట్ల గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు చేతికి అందిన తమ పంటలను కుంటలు, చెరువుల్లో నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా సుదూరం నుంచి పైప్ లైన్లు వేసి కాపాడుకుంటున్నారు. అధికారులు నిరంతరంగా సాగునీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### వారబందీ వల్లే నీరందడం లేదు..



మూడెకరాలు కౌలుకు తీసుకొని కలకోట మేజర్ చివర ఆయకట్టులో మొక్కజొన్న సాగు చేశా. సాగు నీరు అందకపోవడంతో కంకి గింజ పట్టలేదు. గతంలో ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పుడు కనీసం 10 క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడి, చేసిన చాకిరి వృథాగా పోతుంది. వారబందీ లేకుండా సాగునీటిని విడుదల చేస్తేనే చివర భూములకు నీరు అందుతుంది. గత నెల 23న కాలువకు నీటిని బంద్ చేశారు. ఇప్పుడు నీరు ఇచ్చినా ఆయకట్టు చివర రైతులకు ప్రయోజనం లేదు. జరిగే నష్టం ఇప్పటికే జరిగిపోయింది. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

**– ముప్పవరపు రాంబాబు, కౌలు రైతు, నారాయణపురం**

### కండ్లముందే పైరు ఎండుతోంది..



కలకోట మేజర్ కాల్వ పరిధిలోని నారాయణపురంలో ఆరెకరాల మొక్కజొన్న సాగు చేశాను. ఎకరానికి రూ.15 వేల కౌలు, రూ.25 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. గింజ పట్టే దశలోనే మొక్కజొన్న పంటకు సాగునీరు అందడం లేదు. కండ్ల ఎదుటే పైరు ఎండిపోతున్నది. వారబందీ కారణంగా సక్రమంగా సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండుతున్నయ్. కుంటలు, వాగుల్లో నీటిని ఆయిలింజన్ల ద్వారా తోడి వందల మీటర్లు పైప్‌లైన్ వేసి పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. అయినప్పటికీ ప్రయోజనం లేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం. ప్రభుత్వం కాలువ ద్వారా సక్రమంగా సాగునీరు అందిస్తే మాకు ఈ దుస్థితి ఉండదు.

**– సూర్యదేవర అప్పారావు, కౌలు రైతు, నారాయణపురం, బోనకల్లు**

### మా పంటలు ఎండుతుంటే.. ఆంధ్రాకు నీళ్లా?

తమ పంటలు ఎండుతుంటే ఆంధ్రా ప్రాంతానికి సాగునీరు తరలించడం ఏమిటని మధిర ఇరిగేషన్ ఈఈ రామకృష్ణపై బోనకల్లు మండల రైతులు ఆదివారం కలకోట రెగ్యులేటర్ వద్ద మండిపడ్డారు. గత నెల 23న బీబీసీ కెనాల్‌కు సాగర్ జలాలను నిలిపివేసిన అధికారులు ఆదివారం విడుదల చేశారు. కొణిజర్ల జీరో కిలోమీటర్లు రెగ్యులేటర్ నుంచి 1,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే 21 కి.మీ. రెగ్యులర్ అయిన బీబీసీకి 700 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుంది. కానీ 1,000 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారు. దీంతో బీబీసీ కెనాల్‌కు 500 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్నది. బీబీసీ కెనాల్‌కు సరఫరా అవుతున్న సాగర్ జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించేందుకు అధికారులు నీరు తగ్గించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడి చేరుకొని తమ ప్రాంతంలో మొక్కజొన్న పంటలు ఎండిపోతుంటే ఆంధ్రా ప్రాంతానికి నీరు తీసుకుపోవడం ఏమిటని ప్రశ్నించి రెగ్యులేటర్ల వద్ద తలుపులను తెరిపించారు. బీబీసీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని కోరారు. అనంతరం నీటిపారుదలశాఖ ఈఈ రామకృష్ణ, డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, ఏఈలు రాజేష్, ఏడుకొండలు బీబీసీ కాలువను పర్యవేక్షించారు.

---

# పేదలకు రంజాన్ కిట్ల వితరణ అభినందనీయం

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్


పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం మార్చి 9: పేదలు కూడా రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు విలువైన రంజాన్ కిట్లను జవాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం అభినందనీయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మక్కా మసీదులో 'అవామే ఏ హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్' చైర్మన్ హాఫిజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పువ్వాడ ముఖ్య అతథిగా హాజరై మాట్లాడారు. 13 ఏళ్లుగా జవ్వాద్ తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తుండడం గొప్ప విషయమని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, మైనార్టీ విభాగం బాధ్యులు పగడాల నాగరాజు, మహమ్మద్ తాజుద్దీన్, డి.వెంకటేశ్వర్లు, శీలంశెట్టి వీరభద్రం ఎన్.కోటి, బచ్చు విజయకుమార్, మక్కా మసీదు అధ్యక్షుడు అలీఖాన్, మసీదు ఇమామ్ హాఫిజ్ సయ్యద్ సలీం పాల్గొన్నారు.

# సొంత పార్టీ ఎమ్మెల్యేలే సీఎం పేరు మర్చిపోతున్నారు

## ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

భద్రాచలం, మార్చి 9: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మండిపడ్డారు. చివరికి సొంత పార్టీ ఎమ్మెల్యేలే ముఖ్యమంత్రి పేరును మర్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. భద్రాచలంలోని బీఆర్‌ఎస్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్ల కమీషన్లు, ఇసుక దందాలే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుగా మారాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 30 శాతానికి పైగా రుణమాఫీ కాలేదన్నారు. కాంగ్రెస్ వస్తే కష్టాలు వచ్చినట్లేనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే పల్లెల్లో గత కాంగ్రెస్ పాలనలోని రోజులు మళ్లీ కన్పిస్తున్నాయని అన్నారు. యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్లో పెట్టి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక వ్యాపారం 'మూడు పువ్వులు – ఆరు కాయలు' అన్నట్లుగా సాగుతోందని విమర్శించారు. రాష్ట్ర సచివాలయం ఎదుట కాంట్రాక్టర్లు కూడా ఆందోళన చేపట్టారంటే రాష్ట్ర పరువును కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా నడిబజారులో నిలబట్టిందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. చివరికి తాగునీరు, సాగునీరు కూడా కాంగ్రెస్ ఇవ్వలేకపోతోందని ధ్వజమెత్తారు. ప్రజల కష్టాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్‌ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ రజతోత్సం నేపథ్యంలో ఏప్రిల్ 27న లక్షలాది మంది మధ్య వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్ రావు, కొల్లం జయప్రేమ్‌కుమార్, తుమ్మలపల్లి ధనేశ్వర రావు, అయినాల రామకృష్ణ, గోజుల వెంకటశ్రీనివాస్, చిట్టిమళ్ల అనిల్, పూజల లక్ష్మి, ప్రియాంక పాల్గొన్నారు.